క్లుప్తంగా

శాలిహుండంలో వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న నిర్వాహకులు

గార: మండలంలోని శాలిహుండం పంచాయతీ వేణుగోపాలపురంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జనరల్, ఆప్తమాలజీ, బీపీ, షుగర్, పల్స్, ఈసీజీ, గ్లూకోజ్ వంటి పరీక్షలు జరిగాయి. జెమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ సాయిపవన్, సాయి ప్రకాష్, రాహుల్ రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అంతకుముందు ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ డి.రామ్మోహనరావు, ఏ.రాజశేఖర్, రాజేంద్ర పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: మున్సిపల్ కార్యాలయం వెనుక వాటర్ ట్యాంక్ వద్ద ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ సంఘ సేవకులు సోడవరం ఈశ్వరరావు, బొమ్మనా బాలాజీ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. నెల రోజులుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. దాతల పేరిట కూడా మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

అనాథ వృద్ధులకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నైట్‌షెల్టర్‌లో ఉంటున్న నిస్సహాయ, అనాథ వృద్ధులకు మదర్స్ హెల్పింగ్ సొసైటీ లైన్ డాక్టర్ పైడి ప్రదీప్ జన్మదినం సందర్భంగా శనివారం వస్త్ర, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, తదితర సభ్యులు పాల్గొన్నారు.


స్టాక్ పాయింట్‌కు చేరిన నోట్ పుస్తకాలు



స్టాక్ పాయింట్‌లో పుస్తకాలు సరిచూస్తున్న ఎంఈవో లావణ్య

రణస్థలం: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసేందుకు 45,564 నోట్ పుస్తకాలు చేరాయని ఎంఈవో–2 బి.లావణ్య తెలిపారు. జె.ఆర్.పురం హైస్కూల్లో ఉన్న స్టాక్ పాయింట్‌లో పుస్తకాలు శనివారం భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో నెల రోజుల్లో పాఠ్య పుస్తకాలు కూడా వస్తాయని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర విజయవాడ నుంచి ఈ పుస్తకాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ కో ఆర్డినేటర్ విజయ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా



జీరుపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న కోస్టల్ ఎస్సై హరికృష్ణ

రణస్థలం: సముద్ర తీరంలో అపరిచిత వ్యక్తులు సంచరించిన వెంటనే స్థానిక, మెరైన పోలీసులకు సమాచారం అందించాలని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ కళింగపట్నం సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ అన్నారు. జీరుపాలెం, కొత్తముక్కాం గ్రామాల్లో మత్స్యకారులు, గ్రామస్తులతో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే టోల్‌ఫ్రీ నెంబర్ 1903కు గానీ, కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ 93929 14712 తెలియజేయాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లిలో శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ పర్యవేక్షించారు. ఈ నెలలో అమ్మవారి పండుగలు జరగనున్న నేపథ్యంలో కాలువల్లో పూడికలు తీయించి బ్లీచింగ్ చల్లించారు.

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

- తాటిముంజుల్లో పుష్కలంగా విటమిన్లు
- వేసవి సీజన్ కావడంతో విపరీతంగా డిమాండ్
- నగరంలో ముమ్మరంగా విక్రయాలు

సండే స్పెషల్



శ్రీకాకుళంలో తాటిముంజులు అమ్ముతున్న దృశ్యం

శ్రీకాకుళం: వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు తాటిముంజులు ఎంతగానో దోహదపడతాయి. ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందిన ఈ తాటిముంజుల సీజన్ ప్రారంభం కావడంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తాటికాయలు ముంజలదశలో జెల్లీ మాదిరిగా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. మరో మూడు నెలల్లో తాటిముంజులు తాటిపండ్లుగా మారడంతో పాటు, ఆరోగ్యకరమైన తేగలనూ ఇస్తాయి. ఈ ముంజులు శరీరంలోని చక్కర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి డిమాండ్ ఏర్పడింది.

తగ్గుతున్న చెట్లు.. పెరుగుతున్న రేట్లు..

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్లు అధికంగా ఉండేవి. రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటిచెట్లను నరికేస్తుండటంతో వీటి సంఖ్య ఏటా తగ్గిపోతోంది. కొన్నిచోట్ల చెట్లు ఉన్నా వాటిపైకిఎక్కి తాటికాయలు దింపే కార్మికుల కొరత ఏర్పడడంతో వీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఫలితంగా ముంజల రేట్లు పెరిగిపోతున్నాయి. రణస్థలం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన కల్లు కార్మికులు, రైతు కూలీలు తాటి ముంజులను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పరిమాణాన్ని బట్టి డజను రూ.70 వరకూ విక్రయిస్తున్నారు.

వేసవిలో ఉపశమనం



తాటిముంజులు తినడం వల్ల వేసవి నుంచి ఉపశమనం పొందవచ్చు. వారంలో రెండు, మూడు సార్లు ముంజలు తింటున్నాం.

– రాణి, శ్రీకాకుళం

ఆరోగ్యానికి మంచిది



తాటి ముంజులు తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. పెద్దలందరూ ఇదే చెబుతున్నారు. వేసవిలో మాత్రమే దొరికే తాటిముంజులు తప్పకుండా తింటుంటాను.

– సంధ్య, శ్రీకాకుళం

తుప్పలతో తిప్పలు



చిలకపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకంలో భాగంగా రూ.18 లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వం మారడంతో నిధులు విడుదల కాక 11 నెలలుగా భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం తుప్పలు పెరిగిపోయాయి. నిధులు మంజూరు చేసి భవనం పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం



భగీరథపురం గ్రామ పంచాయతీ ఓలేటి అగ్రహారంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ భవన నిర్మాణానికి తొలుత రూ.7.50 లక్షలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేశారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. సెలవుల్లోనైనా నిర్మాణం పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పొంచి ఉన్న ప్రమాదం



లావేరు మండలం తామాడ పంచాయతీ రాయిలింగారిపేట గ్రామానికి వెళ్లే రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం పొలాల్లోకి వాలిపోయి ప్రమాదకరంగా మారింది. సపోర్టుగా స్తంభాలు వేసినప్పటికీ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రైతులు ఇటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు.

– ఎచ్చెర్ల

ఉత్తరాంధ్రను విస్మరించడం అన్యాయం



మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోదీ రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై మాట్లాడకపోవడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ తూర్పు కాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి అంతా అమరావతిలో కేంద్రీకృతం చేసి తన వర్గీయులకు డబ్బులు దోచిపెట్టేందుకు పాకులాడుతున్నారని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్ పథకాలను గాలికొదిలేసి అమరావతి పేరుతో కోట్లాది రూపాయలనిధులు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రమంతా సమాన ప్రాతిపదికన అభివృద్ధి చేయాలనే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులను తెరపైకి తెచ్చారని, ఈ విషయాన్ని మేధావులు, విద్యావంతులు గమనించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఏపీలో అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలో శ్రీకాకుళం ప్రాంతానికి ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధి చేయాలని విన్నవించారు.

వేసవి నృత్య శిక్షణ ప్రారంభం



శిక్షణ పొందుతున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని శాంతినగర్ కాలనీలో సత్యసాయి నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు ఎస్.పి.కవిత ఆధ్వర్యంలో శనివారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ, జానపదం, కోలాటం తదితర ప్రాథమిక అంశాలపై నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



గీతాలను ఆలపిస్తున్న గాయకులు



నటుడు పోలినాయుడు దంపతులకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 307వ నెలవారీ కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆరోహి సంగీత కళాశాల వ్యవస్థాపకులు పెంకి నాగేశ్వరరావు సారథ్యంలో గాయకులు భాస్కరరావు, ఈశ్వరరావు, వాణిప్రియ, సుధన్వ, జ్యోత్స్న, ఉషారాణి, సుమిత్ర, ఇషా, నారాయణిలు చక్కటి గీతాలను వీనుల విందుగా ఆలపించారు. ముఖ్య అతిథులు అగ్నిమాపక శాఖ అధికారి జిడ్డు మోహనరావు, భాస్కరభట్ల శ్రీరామశర్మ, కాగాన వెంకటరమణలు మాట్లాడుతూ ప్రతినెలా పేద కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో కందుకూరి పురస్కారం అందుకున్న రంగస్థల నటులు మెట్ట పోలినాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య సభ్యులు పొట్నూరు వెంకటరావు, రామచంద్రదేవ్, అప్పారావు పాల్గొన్నారు.

సంక్షోభంలో మీడియా స్వేచ్ఛ

శ్రీకాకుళం అర్బన్ : మీడియాస్వేచ్ఛ సంక్షోభంలో పడిందని పలువురు మేధావులు, మీడియా ప్రతినిధులు, వాకర్స్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాదరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ బి.వి.రవిశంకర్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, డాక్టర్ జి.ఎన్.రావు, ప్రొఫెసర్ మజ్జి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

జి.సిగడాం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతంటూ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవలపై కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పొడిచెత్త, తడి చెత్త వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచిస్తూ శనివారం జి.సిగడాంలో బుర్రకథ ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ గౌరీ, పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి అండగా..



బాబ్జీ కుటుంబానికి సాయం అందజేసిన డ్రైవర్లు. చిత్రంలో ఆర్టీఓ గంగాధర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని గుడివీధికి చెందిన బాబ్జీ అనే టాటా మేజిక్ డ్రైవర్ ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఆల్ లాంధ్ర మేజిక్ ఫ్రెండ్స్ సభ్యులు అండగా నిలిచారు. డ్రైవర్లు చందాలు వేసుకుని సేకరించిన రూ.1,18,166 మొత్తాన్ని ఆర్టీఓ పి.వి.గంగాధర్ చేతుల మీదుగా శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యలగూడెం సత్యనారాయణ, కార్మిక సంఘాల నాయకులు టి.తిరుపతిరావు, సురేష్, వరప్రసాద్, కిరణ్, బాలకృష్ణ, పండు, శ్రీను, రాంబాబు, మల్లేసు, శ్రీనివాస్, శామ్యూల్, నాగరాజు, ఉషాకిరణ్, రవి, శేఖర్, మల్లేష్, శంకరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవరుచుకోవాలి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న చిదంబర శాస్త్రి

శ్రీకాకుళం కల్చరల్ : ప్రతి ఒక్కరూ శంకరాచార్యులు బోధించిన అద్వైత విజ్ఞానం తెలుసుకోవాలని హనుమత్ ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకులు అన్నదానం చిదంబర శాస్త్రి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో శంకరాచార్యులు, రామానుజాచార్యుల గొప్పదనంపై శనివారం ప్రసంగించారు. రామానుజులు, విశిష్టాద్వైతం అనే అంశంపై శ్రీకూర్మ దేవస్థానం స్థానాచార్యులు భాష్యం పద్మనాభాచార్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్ష కార్యదర్శులు గుమ్మా నగేష్, వి.కామేశ్వరరావు, పతంజలి శాస్త్రి, కోమలరావు, నిష్టల నర్సింహమూర్తి, నారాయణమూర్తి, అప్పలకొండ, ఉమారాణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశ సమగ్రత, సమైక్యతకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్ వద్ద శనివారం ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అణచివేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మోదీ ప్రభుత్వం దాదాపు 12 ఏళ్లుగా అధికారంలో ఉందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని యువతకు మాటిచ్చి మోసగించిందని దుయ్యబట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష, కొన్న శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలు ఇచ్చిందని, ఏడాది పూర్తవుతున్నా ఖాళీల భర్తీపై నోరుమెదపకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వేణు, మధు, రమేష్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీజీసెట్‌పై అవగాహన

- రేపటి నుంచి 15 రోజుల పాటు ఓరియంటేషన్ ప్రోగ్రాం
- ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహణ



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్, ఇండియన్ సొసైటీ ఫర్ ఫ్రూగల్ సైన్స్ ఇన్నోవేషన్స్ సంయుక్తంగా ఏపీ పీజీసెట్–2025 సంబంధించి సోమవారం నుంచి 15 రోజులపాటు ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు శనివారం తెలిపారు. ఆర్ట్స్ కళాశాల వేదికగా ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా ఓరియెంటేషన్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళంలో వైద్య సౌకర్యాల వేగవంతమైన పెరుగుదల, వ్యాధుల నివారణ, నిర్ధారణ, చికిత్స రంగాలకి సంబంధించిన సాంకేతిక వినియోగం అద్భుతమైన ఉపాధి అవకాశాలను సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్ (గతంలో బయోటెక్నాలజీ విభాగం) సృష్టిస్తోందని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఈ అవకాశాలను, భవిష్యత్తు సంసిద్ధతను పొందేందుకు, వైద్య రంగాలలో ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్‌కళాశాల)లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి రెండేళ్ల ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

ఆస్పత్రులతో అవగాహన

అప్లయిడ్ సైన్సెస్ విభాగాధిపతి (హెచ్ఓడీ) డాక్టర్ ఎం.ప్రదీప్, లెక్చరర్లు డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణి మాట్లాడుతూ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌ని సమర్థవంతంగా నిర్వహించడం కోసం, కళాశాల అప్లయిడ్ సైన్సెస్ విభాగం, ఆంధ్రప్రదేశ్ మెడ్–టెక్ జోన్ (ఏఎంటీజెడ్)–విశాఖపట్నం, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్‌లో చేరి, ప్రోగ్రామ్ పూర్తి చేసిన విద్యార్థులకు డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫార్మా కంపెనీలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా అభిస్తాయని చెప్పారు. ఏపీపీజీసెట్–2025కి హాజరై లైఫ్ సైన్సెస్ విభాగం, ఏదైనా ఇతర బయోలాజికల్ సైన్సెస్‌లో అర్హత సాధించిన వారందరూ ఈ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. కళాశాలలో 20 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, వివరాలకు కళాశాల బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్(8555911961/ 6301096643)ను నంబర్లు సంప్రదించాలని కోరారు.

హామీలపై దృష్టిపెట్టాలి



గేదెల పురుషోత్తం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అమరావతి పునఃప్రారంభం సభలో సీఎం చంద్రబాబు అంకెలతో పాటు మాటల గారడీయే తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం అన్నారు. ప్రజలకిచ్చిన హామీలపై దృష్టి సారించి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు 23 వస్తే ఒక్కటి కూడా వెనుకబడ్డ శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటుచేయకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు రాజకీయమంతా శిలాఫలకాలే తప్పా పనులు పూర్తి చేసే శ్రద్ధ ఎప్పుడూ ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిందని, కూటమి పాలనలో దోచుకో...దాచుకో అన్న చందంలా ఉందని దుయ్యబట్టారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని గుజరాతిపేట నారాయణ తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం, చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయం, మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి



రావాడలో నాణ్యత పరీక్షలు చేస్తున్న అధికారులు

రణస్థలం : రావాడ పంచాయతీలో ఉప్పివలస నుంచి లంకపేట కేజీబీవీ వరకు రూ. 90 లక్షలతో చేపట్టిన తారురోడ్డుకు నాణ్యత నియంత్రణ ఈఈ ప్రదీప్‌కుమార్ సమక్షంలో శనివారం నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఏఈలు పి.శ్రీధర్, బి.విశ్వనాథం, అప్పన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాజా, అఖిల్ పాల్గొన్నారు.